
రాజాజీనగర్ వైకుంఠ ఆలయంలో రంగనాథస్వామికి అలంకరణ


ఇస్కాన్‌లో వెంకటేశ్వరస్వామి


వయ్యాలికావల్ ఆలయంలో..

వైకుంఠద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు


మార్మోగిన గోవింద నామస్మరణ

తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి


ఇస్కాన్‌లో వైకుంఠద్వార ప్రవేశం..


రాజాజీనగర్‌లో..


ఇస్కాన్‌లో రాధాకృష్ణులకు పూజలు


అలంకరణలో కోటి వెంకటరమణస్వామి, బళ్లారి రామేశ్వర్‌నగర్‌లో, సత్యనారాయణ పేటలో, రూపనగుడిలో..


గోవింద నామ స్మరణతో భక్తురాలి పారవశ్యం

రాజాజీనగర్‌లో భక్తుల క్యూ

వైకుంఠ భవం


ఇస్కాన్ వద్ద భక్తుల సందడి

బెంగళూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి నాడు..వైకుంఠద్వారం ద్వారా దేవదేవుడి దర్శనం ముక్తికి మార్గం.. ఉత్తర ద్వార దర్శనం సర్వపాపాలను తొలగిస్తుందనేది భక్తుల ప్రగాడ నమ్మకం. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజామున 3 గంటల నుంచే దర్శనం ప్రారంభమైంది. అప్పటికే పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు చేరుకున్నారు. చామరాజ పేటలోని కోటి వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

టీటీడీ ఆలయంలో...

వయ్యాలికావల్‌లోని టీటీడీ ఆలయంలో తిరుమల వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేకమైన మంత్రోచ్చారణతో వైకుంఠద్వార పూజ చేశారు. 6 గంటలకు వేదపారాయణం జరిపారు. 7 గంటలకు నాదస్వరం, 8 గంటలకు గీతా పారాయణం కొనసాగింది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడుసార్లు నైవేద్యం సమర్పించారు. నాలుగు బృందాలచే వేర్వేరుగా భజనలు కొనసాగాయి. హేమ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన సాగింది. డీసీఎం డీకే శివకుమార్, ఎమ్మెల్యేలు అశ్వత్థనారాయణ, మునిరత్న, ఆర్‌వి దేశ్‌పాండేలు దర్శనం చేసుకున్నారు. సుమారు 60వేలమంది భక్తులు వైకుంఠద్వార దర్శనం చేసుకున్నట్టు ఆలయ ఈఓ బాలరాజు, సూపరింటెండెంట్ జయంతి తెలిపారు. భక్తులకు తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూతోపాటు అన్నప్రసాదం, బాదంపాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. 300మంది పోలీసులు బందోబస్తులో పాల్గొనగా 200మంది వలంటీర్లు సేవలందించారు. భక్తులు సంతృప్తితో దర్శనం చేసుకున్నారన్నారు. ఎక్కడా భక్తులు ఇబ్బంది పడలేదని అయితే భారీ రద్దీతో జాప్యం జరిగిందన్నారు.

ఇస్కాన్ మందిరంలో...

నగరంలోని రాజాజీనగర్ ఇస్కాన్ మందిరంలో వైకుంఠద్వార దర్శనం కోసం వేలాదిమంది భక్తులు ఉదయం నుంచి రాత్రి దాకా క్యూ కట్టారు. ఎటు చూసినా భక్తజనం సందడి కనిపించింది. తెల్లవారుజామునుంచే భక్తులు దర్శనం కోసం తరలివచ్చారు. ఇస్కాన్ ముఖ్యులు మధుపండితదాస నేతృత్వంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కనకపుర రోడ్డులోని శ్రీనివాసమందిరంలోనూ ప్రత్యేక పూజలు కొనసాగాయి. జయనగర్, హనుమంత నగర్, మల్లేశ్వరం, కెంగేరి, యలహంకతోపాటు పలుచోట్ల ప్రత్యేకపూజలు సాగాయి.

రాష్ట్రవ్యాప్తంగా వైకుంఠద్వార దర్శనంకోసం భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. మైసూరు, చామరాజనగర, మండ్య, రామనగర, దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ జిల్లాలతోపాటు చిక్కమగళూరు, బెళగావి, బాగల్కోటె, హుబ్బళ్ళి, ధారవాడ, శివమొగ్గ తదితర జిల్లాల ఆలయాల్లోనూ భక్తులు దర్శనం చేసుకున్నారు. వయ్యాలికావల్ టీటీడీ ఆలయంలో శనివారం ద్వాదశి నాడు సైతం ఉత్తర ద్వార దర్శనం కొనసాగనుంది. బళ్లారి జిల్లాలోనూ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


మీడియాతో మంత్రి ఎంబీ పాటిల్

ఐదేళ్లూ సిద్దరామయ్యే ముఖ్యమంత్రి..!

● పరిశ్రమల శాఖామంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు/హొస్పేట్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సిద్దరామయ్య ఐదేళ్ల కాలం సీఎంగా కొనసాగుతారని, మధ్యలో మార్పు ఏమీ ఉండదని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ అన్నారు. శుక్రవారం హొస్పేట్ నగరంలో సిరసంగి లింగరాజ దేశాయ్ 164 జయంతి లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల తరువాత కాంగ్రెస్ ముఖ్యమంత్రి మార్పు ఒప్పందం జరిగింది కదా మరి సీఎం మారుతారా అని విలేకరులు ప్రశ్నించగా ఇందుకు మంత్రి బదులిస్తూ అలాంటి మార్పు ఏమీ లేదు సిద్దరామయ్య ఐదేళ్ల ముఖ్యమంత్రి, రెండేళ్ల ముఖ్యమంత్రి కాదు అని బదులిచ్చారు. రాజకీయ నేపథ్యంలో అనేక మార్పులు జరగవచ్చు కానీ సీఎంగా సిద్దరామయ్య ఉంటారని అన్నారు. హంపీ కన్నడ విశ్వవిద్యాలయం సమీపంలో ఇదివరకూ కేటాయించిన భూమిలో యూనివర్శిటీకే కేటాయించారన్నారు. ముడా కేసులో బీజేపీ రాద్ధాంతం చేసిందన్నారు.

విందులు.. వివాదాస్పద వ్యాఖ్యలు

రాష్ట్ర రాజకీయాల్లో విందులు, వివాదాస్పద వ్యాఖ్యలు, అధిష్ఠానం హెచ్చరికలు సాగుతున్న తరుణంలోనే మంత్రి పాటిల్ ప్రకటన పార్టీలో కలకలం రేపింది. మంత్రి సతీశ్‌జార్కిహొళి కొందరికి విందు ఏర్పాటు చేయడం, ఆ తర్వాత మంత్రి పరమేశ్వర్ ఆహ్వానించడంతో అధిష్ఠానం తీవ్రంగా పరిగణించిన విషయం తెలిసిందే. విందులకు అధిష్ఠానం ద్వారా చెక్ పెట్టించిన డీసీఎం డీకే శివకుమార్‌కు మరోసారి ఆగ్రహం కలిగించేలా మంత్రి ఎంబీ పాటిల్ వ్యాఖ్యానించారు. విందు విషయంలోనూ మంత్రి రాజణ్ణ నేరుగా డీకే శివకుమార్‌ను ఉద్దేశించి మేం విందు చేసుకుంటే ఆయన ఆస్తులు ఏమైనా కోరుతున్నామా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇలా సాగుతుండగానే మంత్రి ఎంబీ పాటిల్ కుడా సిద్దరామయ్యకు మద్దతు ఇచ్చేలా ఐదేళ్లు ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారని చెప్పడం వివాదమైంది. తాజాగా శుక్రవారం మంత్రి రాజణ్ణ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. అధికారం పంచుకునేందుకు డీకే శివకుమార్ సిద్ధమవుతున్నారని, అంతకంటే వచ్చే ఎన్నికల్లో గెలుపు సాధించి ఐదేళ్లు ముఖ్యమంత్రి కావచ్చునన్నారు. మార్చిలో అధికార మార్పు ఉంటుందనే చర్చల నేపథ్యంలోనే రాజణ్ణ మాట్లాడారు. రాజకీయ నాయకులకు అధికార ఆశ తప్పు కాదని అయితే 2023 ఎన్నికల్లో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉమ్మడి నేతృత్వానికి ప్రజలు ఆశీస్సులు అందించారన్నారు. 2028లో జరిగే ఎన్నికల్లో గెలుపు సాధించి డీకే శివకుమార్ సంపూర్ణంగా సీఎం కావచ్చునన్నారు. హోమాల పట్ల తనకు నమ్మకం లేదని ఒక్కొక్కరి ఒక్కో అభిప్రాయమన్నారు. త్వరలోనే అధిష్ఠానం ముఖ్యులు బెంగళూరుకు రానున్నట్టు సమాచారం. ఆ పరిణామం ఎలా ఉంటుందో వేచి చూడాలి.

బెంగళూరులో సీజనల్ వ్యాధులపై పరిశోధనకు ప్రత్యేక ల్యాబ్

● వైద్యవిద్యా శాఖామంత్రి శరణప్రకాష్ పాటిల్

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) దక్షిణభారత్‌లో తొలి సీజనల్ వ్యాధుల పరిశోధనల కోసం ప్రత్యేక ల్యాబ్ (ఐఆర్‌డీఎల్ఎ‌స)ను ప్రారంభించడం హర్షణీయమని రాష్ట్ర వైద్యవిద్యా శాఖా మంత్రి శరణప్రకాష్ పాటిల్ అభిప్రాయపడ్డారు. ప్రత్యేక ల్యాబ్‌ను బెంగళూరు మెడికల్ కళాశాలలో ఆరంభించేలా ఎంపిక చేశారని శుక్రవారం ప్రకటించారు. దక్షిణభారత దేశంలో తొలిసారిగా ఇటువంటి కేంద్రం బెంగళూరులో ప్రారంభం కానుందని మంత్రి అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాలకు చెందిన మెడికల్ కళాశాలలో సీజనల్ వ్యాధుల పరిశోధనలు, రోగనిర్ధారణలకు అనుబంధంగా ప్రత్యేక ల్యాబ్‌లను మంజూరు చేస్తోంది. బ్యాక్టీరియాలజీ, మైకాలజీ, ప్యారాసిటాలజీలకు సంబంధించి వైరస్ పరిశోధనలు, రోగనిర్ధారణ ప్రయోగాలయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రోగాల నిర్ధారణకు పరిశోధనల పెంపునకు అనుకూలం కానుందన్నారు. మన సామర్థ్యాన్ని అభివృద్ధి పెంచుకునేందుకు వీలు కల్పించినట్లు అవుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో పరీక్షలు ఉపయోగకరమన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'భీమ సంగమ'

● కాంగ్రెస్‌కు దీటుగా ప్రత్యేక కార్యక్రమానికి ప్రణాళిక

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ వినూత్నమైన కార్యక్రమాలు కొనసాగిస్తున్న తరుణంలో వాటిని ఢీ కొట్టేందుకు బీజేపీ సిద్ధమైంది. కాంగ్రెస్ పార్టీ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' ర్యాలీకి దీటుగా భీమ సంగమ పేరిట బీజేపీ కార్యక్రమాలు చేపట్టదలిచింది. ఈనెల 25వరకు బూత్‌స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిదాకా 'భీమ సంగమ' పేరిట రాజ్యాంగంపై ప్రజల్లో అవగాహన కల్పించదలిచారు. కాంగ్రెస్ పార్టీ ఎందుకోసం రాజ్యాంగ సవరణలు చేసిందో ప్రజలకు తెలియచేయదలిచామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తెలిపారు. కేంద్రంలో బీజేపీ పాలనలో 22 సవరణలు మాత్రమే చేయగా.. కాంగ్రెస్ హయాంలో 106 చేశారని ఈ తేడా తెలియజేయదలచినట్టు పేర్కొన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా 14 సవరణలు చేయగా ప్రస్తుతం నరేంద్రమోదీ మూడో విడత ప్రధానిగా 8 మాత్రమే చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ సమయంలో పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించిందన్నారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను వక్రీకరించి ప్రజల్లో కాంగ్రెస్ దురుద్దేశాలు ప్రచారం చేస్తోందన్నారు. ఈనెల 25వ తేదీ వరకు ప్రతి బూత్‌లోనూ 40-50 మందిని చేర్చి అంబేడ్కర్ చిత్రపటం, రాజ్యాంగం పుస్తకాలకు పుష్పార్చన చేస్తామన్నారు. రాజ్యాంగం చదవాలనే నినాదం చేయదలిచామన్నారు. ప్రతి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎంపీలతోపాటు ప్రముఖ నాయకులంతా కనీసం 50మంది దళితులను ఇంటికి రప్పించుకుని వారితో సహపంక్తి జరపాలని తీర్మానించారు. భీమ సంగమ 25లోగా ముగించాలని, 26న రిపబ్లిక్ డే రోజున మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుంటుందన్నారు.

వడ్డీవ్యాపారుల బెదిరింపులకు ..

ఊరు వదలొద్దు

● అండగా ఉంటాం : చామరాజనగర జిల్లా అధికారి


శిల్పానాగ్

బెంగళూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైనాన్స్ వడ్డీవ్యాపారుల బెదిరింపులకు భయపడవద్దని, ఎవరూ గ్రామాలను వీడి వెళ్లకండి అంటూ చామరాజనగర జిల్లా అధికారి శిల్పానాగ్ ప్రకటించారు. జిల్లాలో వందమందిదాకా గ్రామాలను వీడి పరారీలో ఉన్నట్లు ప్రచారం సాగడంపై జిల్లా అధికారి స్పందించారు. ఎవరూ ఊళ్లు వీడరాదని, అందరికీ అండగా ఉంటామన్నారు. జిల్లా అధికారి, తహసీల్దార్, గ్రామపంచాయతీ పరిధిలో ఎక్కడ ఫిర్యాదు చేసినా పోలీసులు బాధితులకు సాయం చేస్తారన్నారు. సమగ్ర నివేదిక ఇవ్వాలని, నలుగురు అధికారులను నియమించామన్నారు. గ్రామాలవారీగా సభలు జరుపుతామన్నారు. మైక్రోఫైనాన్స్ కంపెనీల నిర్వహణపై పరిశీలిస్తామన్నారు. ఎంతమంది ఊళ్ల నుంచి పరారీ అయ్యారు, ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనేది గ్రామాలవారీగా పరిశీలిస్తామన్నారు. ఎవరూ భార్యాపిల్లలను వీడి వెళ్లరాదని సూచించారు.

గుర్తులివ్వండి..!



● పంచాయతీ ఎన్నికలకు పార్టీ గుర్తులు
● కేరళ తరహా విధానానికి పలువురు ఎమ్మెల్యేల డిమాండ్
● అధ్యయనానికి ప్రత్యేక కమిటీ
● గ్రామాల్లో వైషమ్యాలు తలెత్తుతాయని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం





బెంగళూరు, జనవరి 10(ఆంధ్ర జ్యోతి): పల్లెల్లోనూ పార్టీ గుర్తులతో ఎన్నికలు జరపాలని నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇన్నాళ్లు కేవలం స్థానిక నేతల పేర్లు, గుర్తుల తో జరిగిన ఎన్నికలు తీరు మారనున్నట్లు తెలుస్తోంది. పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశ ప్రగతి సాధ్యమని ఏడున్నర దశాబ్దాలుగా రాజకీయ నాయకులు పంచాయతీ సర్పంచ్ నుంచి ప్రధానమంత్రి దాకా వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థలు బలోపేతం చేయడం ద్వారా ప్రగతితోపాటు గ్రామాలకు అవసరమైన సౌకర్యాలను స్థానిక ప్రజాప్రతినిధులే నిర్ణయించే విధానం ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. అందుకే గ్రామపంచాయతీలకు ప్రత్యేకమైన చట్టాలు చేశారు. ఇప్పటివరకు పంచాయతీలకు రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఎన్నికలు జరిగాయి. పరోక్షంగా పార్టీల మద్దతు ఉన్నా ప్రత్యక్షంగా రాజకీయ పార్టీల గుర్తులతో ఎన్నికలు జరగలేదు. ఈ విధానం వస్తే పల్లెల్లో రాజకీయ కక్షలు పెరుగుతాయనే అభిప్రాయాలు ఉన్నాయి. అయితే ఇటీవల ఎమ్మెల్యేలు నేరుగా రాజకీయ పార్టీలకు అనుగుణంగా ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీలు, తాలూకా పంచాయతీలు, జిల్లా పంచాయతీలను కలిపి స్థానిక సంస్థలుగా పరిగణిస్తారు. తాలూకా, జిల్లా పంచాయతీలకు రాజకీయ పార్టీల గుర్తులతోనే ఎన్నికలు జరుగుతాయి. కానీ గ్రామ పంచాయతీల్లో ఈ విధానం అమలులో లేదు.

రాష్ట్రంలో 6022 గ్రామపంచాయతీలున్నాయి. సరాసరిన ఓ పంచాయతీకి 13 మంది వార్డు సభ్యులు ఉంటారు. ఒక్కో చోట అంతకంటే తక్కువగాను, మరో చోట ఎక్కువగాను ఉండవచ్చు. ఇలా 82,228 మంది వార్డు సభ్యులు ఉంటారు. వార్డు సభ్యులు నేరుగాను, సర్పంచ్ నేరుగాను ఎన్నుకుంటారు. అయితే ఇక్కడ పార్టీలతో సంబంధం లేనందున ఎన్నికలు ముగిశాక అందరూ కలసి సమన్వయంగా ముందుకు సాగుతారు. కానీ తాలూకా, జిల్లా పంచాయతీల్లో రాజకీయ పార్టీల గుర్తులతోనే ఎన్నికలు ఉంటాయి. ఇటీవల పార్టీలకు అతీతంగా పలువురు ఎమ్మెల్యేలు పంచాయతీ ఎన్నికలను రాజకీయ పార్టీలకు అనుగుణంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ప్రియాంకఖర్గేకు వినతిని ఇచ్చారు.

కేరళ తరహాలో..

కేరళతోపాటు పలు రాష్ట్రాల్లో పంచాయతీల ఎన్నికలు రాజకీయ పార్టీలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారు. ఇదే విధానం పలు రాష్ట్రాల్లో కొనసాగుతోంది. రాష్ట్రంలోనూ తాలూకా, జిల్లా పంచాయతీలకు రాజకీయ పార్టీల గుర్తింపుతోనే ఎన్నికలు సాగుతున్నాయి. గ్రామ పంచాయతీలకు ఈ విధానం విస్తరింపచేయాలనే డిమాండ్ నేతల్లో ఇప్పుడు మొదలయ్యింది.

పోటాపోటీ తప్పదా..?

గ్రామపంచాయతీల ఎన్నికలకు పార్టీల గుర్తులు ఉండవు గానీ రాజకీయంగా పోటాపోటీ ఉంటుంది. ఎన్నికలంటే పంచాయతీ సమరమే అనిపించేలా కొనసాగుతాయి. పంచాయతీ ఎన్నికల తరహాలో ఇతర ఏ పోలింగ్ ప్రక్రియ కొనసాగదని చెప్పవచ్చు. ఓటింగ్ 95శాతానికి పైగా పోలింగ్ జరుగుతుంది. రాజకీయ పార్టీల గుర్తులు లేకున్నా మద్దతుదారులను గెలిపించుకునేందుకు తీవ్రమైన కసరత్తు చేస్తారు. గ్రామపంచాయతీల ఎన్నికల వేళ తలెత్తే ద్వేషాలు విపరీతమైన పరిణామాలకు దారితీసిన సందర్భాలూ ఉన్నాయి. ఇదంతా రాజకీయ పార్టీల పరోక్షమైన మద్దతు ఉన్నప్పుడే. ఇక నేరుగా రంగంలోకి దిగితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పైగా పంచాయతీల్లో అభ్యర్థులను గెలిపించుకుంటే బలం చేకూరినట్లేనని రాజకీయపార్టీలు భావిస్తాయి.

విప్ అమలుకు అనుకూలం

పార్టీ గుర్తులు లేని కారణంగా అవిశ్వాసం సందర్భంలో వార్డు సభ్యులు ఎలాగైనా ఎవరికైనా మద్దతు ఇచ్చే వెసలుబాటు ఉంది. అదే రాజకీయ పార్టీల ద్వారా కొనసాగితే విప్ జారీ చేసేందుకు వీలుంటుంది. గ్రామపంచాయతీలు ఇప్పటికే రాజకీయ వైషమ్యాలు తీవ్రమైన పరిణామాలకు కారణమవుతున్నాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని పార్టీల గుర్తులతో ఎన్నికలు జరపాల్సి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం సాంకేతిక కారణాలు మాత్రమే కాకుండా గ్రామాల్లో సామాజిక సమైక్యత ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పరిశీలిస్తాం : మంత్రి ప్రియాంక ఖర్గే


ప్రియాంక ఖర్గే

మరో రెండేళ్ల తర్వాత గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అప్పట్లోగా నిపుణుల అభిప్రాయాలు తీసుకుని ప్రజాభిప్రాయంతోపాటు కేరళతోపాటు వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకుంటామని మంత్రి ప్రియాంక ఖర్గే అభిప్రాయపడ్డారు.

న్యూస్ బాక్స్

జాతీయస్థాయి ఆటశాల కాన్ఫరెన్స్ ప్రారంభం



ఆటశాల వర్క్‌షాపులో కోచ్‌లు, క్రీడానిపుణులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటశాల కాన్ఫరెన్స్ శుక్రవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ప్రారంభించారు. మొదటి రోజు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, అథ్లెటిక్ క్రీడాకారిణి కీర్తన, ఏఎస్ఏ కోచ్ కుమార్‌లు వర్క్‌షాపును ప్రారంభించారు. ఒడిశా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ పీఆర్‌ఓ సుహేల్‌తండన్ లైఫ్ స్కిల్స్ క్రీడావిద్యా సంస్కారంపై వివరించారు. బెంగళూరుకు చెందిన సింపుల్‌స్పోర్ట్ ఫౌండేషన్ అదితి ముటాత్కర్ మహిళా సాధికారత, బాలికల క్రీడాభాగస్వామ్యం వివరించారు. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, సుహేల్‌తండన్‌లు క్రీడల్లో పాటించాల్సిన నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. కాన్ఫరెన్స్ శనివారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు న్యాయమైన పరిహారం అందాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి10(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చే రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చూడాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డీఎల్‌సీ సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామం వద్ద కొత్త రైల్వేస్టేషన్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అక్కడ స్టేషన్ నిర్మాణానికి 17.97ఎకరాల విస్తీర్ణంలో భూములను సేకరిస్తామన్నారు. ఆభూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో ప్రతిపాదిత మార్కెట్ విలువకు అనుగుణంగా పరిహారం సొమ్ము ఇచ్చామన్నారు. ట్రాన్స్‌కో విభాగానికి 21టవర్లు, 132, 220,400 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్‌లను మార్చడం కోసం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మార్కెట్ విలువకు అనుగుణంగా మూడు విధాలుగా నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. పరిహారం పంపిణీ పూర్తికావడంతో పనులు చేపట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ జేడీ నరసింహారావు, ఎన్‌హెచ్ ఏపీడీ తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో చిరుత..!



కొండలో సంచరిస్తున్న చిరుత

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధి ముదిగల్లు గ్రామంలో శుక్రవారం చిరుత కలకలం రేపింది. ఇళ్ల పక్కనే ఉన్న కొండల్లో చిరుత కనిపించడంతో ప్రజలు భయాందోళనలకు లోనయ్యారు. తరచూ చిరుత సంచరిస్తుండటంతో పొలాల్లోకి వెళ్లాలంటే రైతులు భయపడిపోతున్నారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని వారు వాపోతున్నారు.

24న అనంతకు విద్యాశాఖ కమిషనర్ రాక

అనంతపురం విద్య, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఈ నెల 24న జిల్లాకు రానున్నారు. తొలిసారి ఆయన అనంతపురం జిల్లాకు రానున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖాధికారులతోపాటు, ఐసీడీఎస్ అధికారులతో కమిషనర్ వేర్వేరుగా సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యంగా 117 జీవో ఉప సంహరణ, స్కూల్ కాంప్లెక్స్ మోడిఫికేషన్ తదితర అంశాలపై డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశం నిర్వహించే వేదికను ఎంపిక చేసే పనిలో విద్యాశాఖాధికారులున్నారు. అనంతపురంలోని జేఎన్‌టీయూ లేదా ఇతర ప్రాంతాల్లో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

వరించిన సంతోషం

24 గంటల్లో వరి ధాన్యం కొనుగోళ్ల సొమ్ము జమ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

గతేడాది మూడు నెలల వరకు ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వ తీరుపట్ల అన్నదాతల హర్షం

బొమ్మనహాళ్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వరి ధ్యానం విక్రయించిన 24గంటల్లోనే ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ములు జమ చేస్తుండటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. గత వైసీపీ పాలనలో ధాన్యం డబ్బులు కోసం రైతులు నెలల తరబడి ఎదురు చూశారు. ధాన్యం విక్రయించిన 90 రోజులకు కూడా నగదు అందకపోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారుల చుట్టూ అన్నదాతలు ప్రదక్షిణ చేశారు. ప్రభుత్వ ఆలస్యంగా ధాన్యం సొమ్ము జమ చేస్తుండటంతో కొందరు రైతులు దళారులకే తమ పంటను విక్రయించారు. అయితే ఈ ఏడాది ఆ బాధలన్నీ తొలగిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల నుంచి సొమ్ము జమ చేసే వరకూ ప్రతిది పక్కాగా అమలు చేస్తుండంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు శ్రీధరఘట్ట సొసైటీ పరిధిలో 315 మంది రైతుల నుంచి 35,120 క్వింటాళ్ల వరిధాన్యం సేకరించారు. ఉద్దేహాళ్ సొసైటీ పరిధిలో 208 మంది రైతుల నుంచి 25,587 క్వింటాళ్లు సేకరించారు. ఈ ధాన్యం విలువ రూ.14.78 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.14 కోట్లు జమ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. దీన్ని బట్టి కొనుగోలు ప్రక్రియ అంతా ఎంత వేగంగా జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

24 గంటల్లోనే..



169 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించా. 24 గంటల్లో నగదు బ్యాంక్ ఖాతాల్లో జమ అయింది. గత వైసీపీ పాలనలో ధాన్యం విక్రయించి నెలల తరబడి డబ్బు కోసం ఎదురు చూశా. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగానే 24 గంటల్లో నగదు ఖాతాలో జమ చేశారు. చాలా సంతోషంగా ఉంది. నా ఒక్కడికే కాదు ప్రభుత్వానికి విక్రయించిన ప్రతి రైతు సంతోషంగా ఉన్నారు.

- లక్ష్మన్న రైతు, రంగాపురంక్యాంప్

సమస్యగా మారిన తేమ

ఈ ఏడాది రైతులకు ధాన్యంలో తేమ సమస్యగా మారింది. ధాన్యంలో తేమ 25 శాతం వరకు ఉంటోంది. రెండు తుపాన్ల ప్రభావంతో ఎండలు తక్కువగా ఉన్నాయి. అయితే తేమ శాతాన్ని వ్యవసాయ శాఖ సిబ్బందే క్షేత్రస్థాయిలో పరిశీలించి ధాన్యం కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. 17 శాతం కంటే తక్కువ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేశాక 24 నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బు జమవుతోంది. ఈ పరిణామం రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది.

నాలుగు రోజులకే ధాన్యం విక్రయించా



వరి పంట కోత కోసిన నాలుగు రోజులకే ధాన్యం విక్రయించా. ముందుగా రైతుసేవాకేంద్రంలో నమోదు చేసుకొన్నా. వెంటనే ఖాళీ సంచులు ఇచ్చారు. లారీ ఏర్పాటు చేశారు. వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి లోడు చేసి పంపించిన 24 గంటల్లో నగదు జమ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. 690 క్వింటాళ్లు విక్రయించా. రూ.15.45 లక్షలు నగదు బ్యాంక్ ఖాతాలో జమ అయింది. గతంలో ఎప్పుడు ఇంత త్వరగా ధాన్యం డబ్బులు రాలేదు.

- ఎర్రిస్వామి, రైతు, శ్రీధరఘట్ట

అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండ



కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులను జమ చేస్తోంది. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత డబ్బులు కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. కానీ కూటమి పార్టీల పాలనలో పరిస్థితి మారింది. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది. రైతుకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. గత వైసీపీ పాలనలో ధాన్యం అమ్ముకోవడాని రైతులు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. వీటిని సరిదిద్ది కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా నడిచేలా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది.

- కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే

పాలిటెక్నిక్ విద్యార్థులకు లోకేశ్ ప్రశంసలు



నగదు అందిస్తున్న ప్రిన్సిపాల్

రాయదుర్గం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్ 2024-25 పోటీలో ప్రతిభ కనబరిచి మంత్రి నారా లోకేశ్ నుంచి ప్రశంసలు అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసులు తెలిపారు. కళాశాల నుంచి ఎంపికైన రెండు ప్రాజెక్టులు లోకేశ్‌ను ఆకట్టుకున్నాయని వివరించారు. ప్రభుత్వం తరపున ఈ ప్రాజెక్టులకు ప్రోత్సాహం అందిస్తామని లోకేశ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం సోలార్‌తో నడిచే స్మార్ట్ వీల్‌ఛైర్‌ను కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు నరేశ్, యోగేశ్, మధుసూదన్ తయారని చెప్పారు. కుర్చీగానే కాకుండా బెడ్, రిక్లైనర్ లాగా కూడా ఉపయోగించుకోవచ్చు. పోర్టబుల్ టాయిలెట్‌ను కూడా అమర్చారు. కూలీలు తక్కువ శ్రమతో బరువులు మోసే పరికరాన్ని మెకానికల్ విద్యార్థులు ప్రసాద్, బాలాజీ, యశ్వంత్ తయారు చేశారు. ఈ ప్రాజెక్టుల రూపకల్పనకు ముఖ్యకారణమైన కళాశాల లెక్చరర్స్, ప్రాజెక్టు మెంటర్స్ ఎల్ హర్ష, అలీషా, కలాం, షేక్షబానాను ఆయన అభినందించారు. అత్యంత ప్రతిభ కనబరిచి విద్యార్థులు గెలుచుకున్న రూ. 10 వేలు బహుమతిని వారి చేతికి అందజేశారు.

కిడ్నాప్, చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ

తాడిపత్రి, జనవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలో గన్నెవారిపల్లికాలనీకి చెందిన మహిళను కిడ్నాప్ చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. మహిళను కొట్టి మెడలో ఉన్న చైను, కమ్మలు దొంగతనం చేసిన కేసులో వీరాంజనేయులు, రాధమ్మ, భూలక్ష్మి, దశరథను అరెస్ట్ చేసి వారి నుంచి 3.2తులాల బంగారు గొలుసు, కమ్మలు, స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రేణుకకు వీరాంజనేయులుకు గతంలో ఆర్థిక లావాదేవీలు ఉండడంతో మనస్పర్థలు ఉండేవన్నారు. అప్పటి నుంచి వీరాంజనేయులు రేణుకపై కక్ష పెంచుకున్నారన్నారు. అందులో భాగంగా రెండురోజుల క్రితం వీరాంజనేయులు, అతడి భార్య రాధమ్మ, అత్త భూలక్ష్మి, డ్రైవర్ దశరథ సాయంతో చుక్కలూరు వద్ద పనులకు వెళుతున్న రేణుకను స్కార్పియో వాహనంలో కిడ్నాప్ చేశారన్నారు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఆమెను చితకబాది మెడలో ఉన్న బంగారు గొలుసు, కమ్మలు తీసుకొని ఆమెను అక్కడే వదిలేశారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. అందిన సమాచారం మేరకు చుక్కలూరు క్రాస్ వద్ద స్కార్పియోలో వెళుతున్న నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై తిరుగుబాటు

కళ్యాణదుర్గం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండల పరిధిలోని రాళ్లపల్లిలో ఇసుక అక్రమ రవాణాపై గ్రామస్థులు తిరగబడ్డారు. శుక్రవారం ఆ గ్రామ సమీపంలోని వంకలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండటంతో గ్రామ మహిళలు, గ్రామస్థులు ఎదురు తిరిగారు. వంకలో నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్లను నిలిపివేసి రోడ్డుకు



వీఆర్వో సూర్యనారాయణతో వాదిస్తున్న గ్రామస్థులు

ట్రాక్టర్లను ఆపివేసిన గ్రామస్థులు

అడ్డుగా నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తాగడానికి నీరు లేక ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామ సమీపంలోని ఇసుకనంతా తోడేస్తే ఎక్కడికి వెళ్లాలంటూ గ్రామస్థులు అధికారులను ప్రశ్నించారు. ఇక్కడి నుంచి ఒక్క ట్రాక్టర్ ఇసుకను కూడా రవాణా చేసేది లేదంటూ అక్కడికి వచ్చిన వీఆర్వో సూర్యనారాయణతో వాదించారు. ఉచిత ఇసుకయితే రోజుకు రెండు, మూడు ట్రాక్టర్లు రవాణా చేసుకోవాలే గానీ.. ఇలా ఈ వంక వద్ద ట్రాక్టర్లన్నీ క్యూ కడుతున్నాయన్నారు. దీంతో భూగర్భజలాలన్నీ ఎండిపోయే ప్రమాదం వుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, వీఆర్వో సూర్యనారాయణ స్పందించి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలపడంతో గ్రామస్థులు శాంతించారు.



దారికి అడ్డంగా నిలబడిన గ్రామస్థులు

ఏటీఎం కేంద్రంలో మోసం

కార్డు మార్చి.. నగదు డ్రా..



గుత్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఏటీఎం సెంటర్‌కు వచ్చేవారిపై నిఘా ఉంచి డబ్బు డ్రాచేసి ఇస్తానని ఏమార్చి ఏటీఎం కార్డు మార్చేసి, అందులోని నగదు డ్రా చేసుకుని ఉడాయించాడు ఓ దుండగుడు. పట్టణంలో శుక్రవారం ఈ మోసం వెలుగుచూసింది. పట్టణానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీదేవి.. భర్తతో ఏటీఎం కార్డు పంపించి, రూ.3000 డ్రా చేయమని చెప్పింది. అతనికి ఏటీఎం సెంటర్ వద్ద ఆపరేటింగ్ చేయడం రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ యువకుడిని అడిగాడు. ఇదే చాన్స్ అనుకున్నాడు ఆ దుండగుడు. వృద్ధుడిని మభ్యపెట్టి ఏటీఎం కార్డు మార్చేశాడు. సర్వర్ బిజీ ఉంది కాసేపు ఆగి మరి డ్రా చేసుకో అంటూ అతని వద్దనున్న కార్డు మార్చి వేరొకటి ఇచ్చాడు. అక్కడి నుంచి వెళ్లిపోయి మరో ఏటీఎంలో 9,00,600 డ్రా చేశాడు. నగదు డ్రా చేసినట్లు వృద్ధుడి ఫోన్‌కు మెసేజ్ రావడంతో అయోమయానికి గురయ్యాడు. విషయాన్ని వెంటనే పోలీసులకు అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

గొంతు కోసుకుని వ్యక్తి మృతి

రాయదుర్గంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల కారణంగా రాజన్న(60) అనే వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కాశీపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రాజన్న కూలీ పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబ సమస్యలతో సతమతమవుతూ మనస్తాపానికి గురై గురువారం రాత్రి గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ముక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కొడుకులు ఉన్నారని పేర్కొన్నారు.

పది ఇళ్లలో చోరీ

ఒక ఇంట్లో మాత్రమే వెండి, నగదు అపహరణ

తాడిపత్రి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఇళ్లు, పలు షాపుల్లో శుక్రవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న శివనాగన్న ఇంట్లో రూ.50వేల నగదు, 30వేలు విలువగల వెండి, అరతులం బంగారం చోరీకి గురైందని పోలీసులు తెలిపారు. శివనాగన్న కుటుంబ సభ్యులతో కలిసి గుత్తికి వెళ్లాడు. బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న వెంకటనారాయణ హోటల్, మహేశ్వరరెడ్డి పైపుల దుకాణం, ఫొటోస్టుడియో, ఆర్ఎంపీ నివాసం, డెంటల్ ఆసుపత్రితోపాటు పలు ఇళ్లల్లో చోరీకి తెగబడ్డారు. ఒక్క ఇంటిలో తప్ప మరెక్కడా నగదు, ఆభరణాలు చోరీకి గురికాలేదు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందలపాడుకు చెందిన నవీన్‌కుమార్ (21) అప్పుల బాధ తాళలేక శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. నందలపాడుకు చెందిన ఆదినారాయణ, నాగరత్నమ్మ దంపతులకు ఇద్దరు సంతానం కాగా నవీన్‌కుమార్ రెండవవాడు. నవీన్‌కుమార్ గ్రానైట్ బండలను పరిచే పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలం నుంచి చెడుఅలవాట్లకు బానిసై అప్పులు చేశాడు. ఒత్తిళ్లు ఎక్కువకావడంతో అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా..?

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ప్రజల నుంచి భారీగా అర్జీల స్వీకరణ

రెవెన్యూ రికార్డుల్లో తప్పులే అధికం



బత్తలపల్లి మండలం మాల్యవంతం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ (ఫైల్)

ధర్మవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా భూములను చెరబట్టడమే కాకుండా రాజకీయ జోక్యంతో వేలాది ఎకరాలను వివాదంలో పడేసి ఎంతో మందిని బాధితులుగా మార్చారు. బాధితుల గోడు వినకపోగా.. తిరిగి వారిపైనే కేసులు బనాయించి భూ మాఫియాకు వైసీపీ నేతలు అండగా నిలిచారన్న విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. గత ప్రభుత్వంలో భూసమస్యలపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడమే కాకుండా వాటిని వైసీపీ నేతలే హస్తగతం చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఈ పరంపరలోనే కూటమి ప్రభుత్వం కొలువు తీరడంతో భూ వివాదాలకు పరిష్కారం దొరుకుతుందనే ఆశతో పెద్ద సంఖ్యలో బాధితులు అధికారులను ఆశ్రయించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఎక్కువగా భూ వివాదాలకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. ప్రజాదర్బార్‌లలో సైతం ఎక్కువగా భూ బాధితులే ఉన్నారు. ఈ క్రమంలో ఆయా సమస్యలకు చెక్ పెట్టడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రెవెన్యూ గ్రామాల ప్రామాణికంగా సదస్సులు నిర్వహించి భూ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిసెంబరు 6 నుంచి వాటికి శ్రీకారం చుట్టగా జనవరి 8వ తేదీన ముగిశాయి. ఒక్కో మండలంలో రోజుకు ఒక గ్రామంలో సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామంలోని భూ బాధితుల సమస్యలతో మళ్లీ అధికారులను ఆశ్రయించకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ఒక్కో గ్రామంలో ఉండేలా షెడ్యూల్ రూపొందించుకుని బాధితుల నుంచి అర్జీల స్వీకరించి, కొన్ని అక్కడికక్కడే పరిష్కరిస్తూ వచ్చారు. ఈ సదస్సులు తహసీల్దార్ నేతృత్వంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్‌ఓలు బృందంగా ఏర్పడి పాల్గొన్నారు. వీరితో పాటు దేవదాయ, రిజిస్ట్రేషన్, అటవీ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సదస్సులతో అయినా భూ సమస్యలకు చెక్ పడాలని బాధితులు ఎదురుచూస్తున్నారు. నెలకుపైగా జరిగిన సదస్సుల్లో రెవెన్యూ రికార్డుల్లో తప్పులే అధికంగా ఉన్నాయి. సమస్యలపై ఆయా సదస్సుల్లో బాధితులు బారులు తీరారు. రికార్డుల్లో ఉండాల్సిన భూమి కంటే తక్కువ విస్తీర్ణం ఉందని పలువురు నివేదించారు. ఇలాంటి ఫిర్యాదుల విషయంలో ఉన్నతస్థాయిలో సర్వే నిర్వహించి తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. ముందుగా ఇరుపార్టీలకు నోటీసులు జారీ చేయడంతో పాటు సిబ్బంది విచారణ చేపడుతారని తరువాతే వీటి విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుందని యంత్రాంగం చెబుతోంది. సదస్సులో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపడుతామని అధికారులు చెబుతున్నారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో కూడా రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు అందాయి.

462 గ్రామాల్లో సదస్సులు

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 462 గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో 49 రకాల సమస్యలపై 4,522 ఫిర్యాదులు అందాయి. ఇందులో రెవెన్యూ అధికారులు 2023 ఫిర్యాదులను పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 2,499 అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల్లో రెవెన్యూ రికార్డుల్లో తప్పులపై 1446, పొలాల సరిహద్దులు 364, మ్యూటేషన్ 263, సాగు, ఇళ్లపట్టాలు 4,123, విస్తీర్ణంలో తేడాలు 226, ఇతర సమస్యలపై 1810 వచ్చినట్లు జిల్లా రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

జగనన్న కాలనీలపై విజిలెన్స్ విచారణ

ధర్మవరంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లిలో గత వైసీపీ హయాంలో జగనన్న కాలనీల కోసం భూములిచ్చిన రైతులతో శుక్రవారం విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐ సద్గురుడు విచారణ చేశారు. ఎంతమంది రైతులు భూములు ఇచ్చారు, ఎన్ని ఎకరాలు సేకరించారు అన్న వివరాలను తెలుసుకున్నారు. 23 మంది రైతులు, 73.34 ఎకరాలు భూములు ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అనంతరం విజిలెన్స్ డీఎస్పీ, సీఐలు రైతులతో మాట్లాడుతూ.. ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారా, అప్పట్లో ఎవరైనా బలవంతంగా తీసుకున్నారా, పరిహారం పూర్తిగా ఇచ్చారా, ఇప్పటి వరకు ఎవరికైనా పరిహారం ఇవ్వలేదా అని ఆరాతీశారు. ఏమైనా ఇబ్బందులు పెట్టి ఉంటే తమ దృష్టికి తేవాలని తెలిపారు.



రైతులతో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం

పిల్లల లెక్క తప్పితే.. హెచ్‌ఎంలదే బాధ్యత

20 నుంచి జిల్లాల పర్యటనకు వస్తా

వీసీలో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు




వీసీలో మాట్లాడుతున్న కమిషనర్, హాజరైన డీఈఓ ఇతర అధికారులు

అనంతపురం విద్య, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యపై తప్పుడు సమాచారం ఇచ్చినా... లెక్కలు తప్పినా...చర్యలు తప్పవని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు హెచ్చరించారు. ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ జిల్లాల పర్యటనకు వస్తానని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఆడిటోరియంలో డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, కాంప్లెక్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయులతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా117 జీవో రద్దు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు, బోధనా సిబ్బంది పునర్విభజన తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 20వ తేదీ తర్వాత తాను జిల్లాల పర్యటనకు వస్తానన్నారు. మీరు చెబుతున్న డేటాకు, క్షేత్రస్థాయిలో ఉన్న దానికి తేడా ఉండకూడదన్నారు. విద్యాశాఖ పిల్లల కోసం ఎంతగానో ఖర్చు చేస్తోందన్నారు. హెచ్‌ఎంలు ఇచ్చే డేటా మేరకే పిల్లల కోసం కిట్లు, బుక్స్, ఇతర మెటీరియల్ కొంటున్నారన్నారు. డబ్బులు వృథాకాకూడదని అన్నారు. ప్రధానోపాధ్యాయులు తప్పుడు డేటా ఇస్తే...చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇచ్చిన గైడ్‌లైన్స్ చదవకుండా... తాను జిల్లా పర్యటనలకు వచ్చినప్పుడు డీఈఓలు, డీవైఈఓలు, ఎంఈఓలు సైతం తనకు సంబంధం లేదని అనడానికి వీల్లేదన్నారు. సమావేశంలో డీవైఈఓలు శ్రీనివాసులు, శ్రీదేవి, ఎంఈఓలు, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కాంటె సీసర్ మాటె (జయంతి)



కాంటె సీసర్ మాటె 1809 జనవరి 11న ఇటలీ దేశం బోలోగ్న నగరంలో జన్మించారు. రోమ్ పార్లమెంటు సభ్యుడిగా వ్యవహరించారు. తల్లి కేన్సర్‌తో మృతి చెందిన కారణంగా నేచరల్ మెడిసిన్‌తోపాటు పలు వైద్య అంశాలపై పరిశోధించారు. శామ్యూల్ హానెమన్ ప్రతిపాదించిన సూత్రాలను విస్తృతం చేసి 'ఎలక్ట్రో హోమియోపతి' (మాటె కేన్సర్ క్యూర్)గా అభివృద్ధి చేశారు. జీవిత పర్యంతం పేదలకోసం పాటుపడ్డారు. 1896 ఏప్రిల్ 3న కన్నుమూశారు.

మొహమ్మద్ కులీ కుతుబ్ షా (వర్ధంతి)



మొహమ్మద్ కులీ కుతుబ్ షా 1565 ఏప్రిల్ 4న జన్మించారు. గోల్కొండ కుతుబ్ షాహి వంశానికి చెందిన ఐదవ సుల్తాన్. 15వ యేటనే సింహాసనాన్ని అధిష్ఠించి 31ఏళ్లపాటు పాలించారు. హైదరాబాద్ నగర నిర్మాత. చారిత్రాత్మక చార్మినార్, మక్కా మసీదులను నిర్మించిన ఘనత ఆయనదే. అరబ్బీ, పర్షియన్, ఉర్దూ, తెలుగు భాషలలో పాండిత్యం గలవారు. ఉర్దూ సాహిత్య జగతిలో 'దీవాన్' (కవితా సంపుటి)గల తొలి సుల్తాన్. 1612 జనవరి 11న కన్నుమూశారు.

లాల్‌బహదూర్ శాస్త్రి (వర్ధంతి)



'జై జవాన్ - జై కిసాన్' అనే నినాదంతో స్ఫూర్తిగా నిలిచిన దేశ రెండో ప్రధానిగా వ్యవహరించిన లాల్‌బహదూర్ శాస్త్రి 1904 అక్టోబరు 2న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముఘల్‌సరాయ్ ప్రాంతంలో జన్మించారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. లోక్‌సేవా మండల్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. వ్యవసాయ విప్లవానికి బాటలు వేశారు. ప్రధానిగా క్షీరవిప్లవానికి నాంది పలికి జాతీయ స్థాయిలో పాలడెయిరీ అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేశారు. 1965లో ఇండో-పాక్ యుద్ధానికి నేతృత్వం వహించారు. 1966 జనవరి 11న కన్ను మూశారు. మరణానంతరం భారతరత్న ప్రకటించారు.

వి. మధుసూదన రావు (వర్ధంతి)



ప్రముఖ దర్శక నిర్మాత వీరమాచనేని మధుసూధనరావు 1917 జూలై 27న కృష్ణా జిల్లా పెయ్యేరులో జన్మించారు. స్క్రీన్ రైటర్‌గా రాణించారు. అన్నపూర్ణ, జమీందారు, అంతస్థులు, ఆరాధన, ఆత్మబలం, స్వాతికిరణం వంటి సినిమాలు ఎంతో పేరొందాయి. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించి పలువురు కళాకారులను పరిచయం చేయడమే కాక రాఘవేంద్రరావు, కోదండరామిరెడ్డి, పీసీ రెడ్డి, బోయిన సుబ్బారావు తదితర అగ్రదర్శకులంతా ఈయన వద్ద శిష్యరికం చేసినవారే కావడం విశేషం. రఘుపతి వెంకయ్య అవార్డు, నంది, ఇతర పురస్కారాలు పొందారు. ఐదు దశాబ్దాలలో నాలుగు భాషలలో కలిపి 71 సినిమాలకు దర్శకత్వం వహించి 'విక్టరీ'ని ఇంటి పేరుగా మార్చుకున్నారు. 2012 జనవరి 11న కన్నుమూశారు.

రాహుల్ ద్రావిడ్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత రాహుల్ శరద్ ద్రావిడ్ 1973 జనవరి 11న మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జన్మించారు. అనంతరం బెంగళూరుకు కుటుంబం మారింది. భారత క్రికెట్ జట్టుకు కేప్టెన్‌గా వ్యవహరించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో సుమారు 25వేల పరుగులు చేసి గ్రేటెస్ట్ బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా నిలిచారు. టెస్ట్‌క్రికెట్‌లో త్రిపుల్ సెంచరీ (309) చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారు. అభిమానులచే 'మిస్టర్ డిపెండబుల్', 'ది గ్రేట్ వాల్'గా పిలవబడ్డారు. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో డైరెక్టర్‌గా కొనసాగుతూ అండర్- 19, 'ఇండియా ఏ' జట్లను పర్యవేక్షించారు. ప్రస్తుతం క్రికెట్ జాతీయజట్టుకు ప్రధాన కోచ్‌గా ఉన్నారు. పద్మశ్రీ, అర్జున సహా డాన్ బ్రాడ్‌మన్ అవార్డు, తదితర అవార్డులు పొందారు.


బాగేపల్లిలో భూనీల లక్ష్మీ వెంకటరమణస్వామి


జయనగర్ మూడోబ్లాక్ ఎల్ఐసి కాలనీలో


హరాడిలోని లక్ష్మీనారాయణ స్వామి


బెమెల్ లే అవుట్‌లోని వెంకటరమణస్వామి


కోటి వేణుగోపాలస్వామి ఆలయంలో


బూదిగెరె దేశనారాయణస్వామి ఆలయంలో

వైకుంఠద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు


ఆలంబగిరి ఆలయం వద్ద భక్తుల క్యూ

బాగేపల్లి: తాలూకా వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శుక్రవారం వేకువజామున సుప్రభాత, విశేషపూజలు, పుష్పాలంకరణలు సాగాయి. పట్టణ శివారులోని భూనీల లక్ష్మీ వెంకటేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. విశేషపూజల్లో బాగేపల్లి ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అశ్వథస్వామి మాట్లాడుతూ అన్ని కష్టాలు, సమస్యలను మహావిష్ణువు పరిహారం చేస్తారనే విశ్వాసం ఉందన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, లడ్డూ పంపిణీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బాగేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కె వర్ణి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మహదేవపురలో...

మహదేవపుర: నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. హరాడి, కుందలహళ్ళి, బెమెల్ లే అవుట్, రామగొండనహళ్ళి, మున్నెకొళ్ళాల, కావేరినగర్ ప్రాంతాలలోని నారాయణస్వామి, భూనీళా సమేత వేంకటరమణస్వామి, చన్నరాయస్వామి ఆలయాలను పుష్పాలతో ముస్తాబు చేశారు. స్థానిక ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి, రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సచ్చిదానందమూర్తి, మాజీ ఉపసభాపతి జీకే కృష్ణారెడ్డి, ఆలయ ధర్మాధికారి జయరాం, స్థానిక ప్రముఖులు హరాడి పిళ్ళప్ప, అభిషేక్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

దేవనహళ్ళిలో...

దేవనహళ్ళి: దేవనహళ్ళి తాలూకాలోని పలు ఆలయాలలో సందడి నెలకొంది. బూదిగెరె గ్రామంలోని దేశ నారాయణ స్వామి ఆలయంలోనూ, దేవనహళ్ళిలోని ప్రసిద్ధ కోటి వేణుగోపాలస్వామి ఆలయంలోనూ, తరబనహళ్ళి లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలోనూ, బేగూరు లోని వరలక్ష్మి నరసింహస్వామి ఆలయంలోనూ ఇతర ఆలయాల్లోనూ విశేషపూజలు, అలంకణలు సాగాయి. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు.

చింతామణి తాలూకాలో..

చింతామణి: చింతామణి పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. కన్నంపల్లిలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలోనూ, కురుటహళ్ళిలోని వీరాంజనేయస్వామి ఆలయంలోనూ, మురగమల్లాలోని ముక్తిగిరి కొండపై వెలసిన ముక్తీశ్వరస్వామి ఆలయంలోనూ, గంగాభవాని ఆలయంలోనూ తదితర ఆలయాల్లో పూజలు, అలంకరణలు సాగాయి. వైకుంఠద్వారం గుండా భక్తులు దర్శనం చేసుకున్నారు.

చేళూరు తాలూకాలో...

చేళూరు: తాలూకా కేంద్రమైన చేళూరులోని వాసవి ధర్మశాలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు సాగాయి. వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. అలాగే ఏనిగదళె గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో బురుడుగుంటె మార్గంలోని లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలోనూ విశేషపూజలు సాగాయి.

బొమ్మనహళ్ళిలో...

బొమ్మనహళ్ళి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వివిధ ఆలయా ల్లో శుక్రవారం ఘనంగా కార్య క్రమాలు జరిగాయి. అరికెరె శాంతిని కేతన్ లే అవుట్ వైశ్యా బ్యాంకు కాలనీలోని కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని పుష్పాలు, విద్యుద్దీపాలతో అలం కరించారు. స్వామివారికి పంచామృతాభిషేకం అనంతరం పుష్పాలంకరణ చేశారు. వైకుంఠద్వారం గుండా దర్శనానికి భక్తులకు వీలు కల్పించారు. ఆలయంలో కన్యకాపరమేశ్వరి, వెంకటేశ్వరస్వామి, ఈశ్వరుడు ఉన్నా రు. భక్తులకు తీర్థప్రసాదాలు, లడ్డూ పంపిణీ చేసినట్టు వాసవి చారిటబుల్ ట్రస్టు ప్రెసిడెంట్ పోతణ్ణశెట్టి తెలిపారు. ఇదే సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి లలిత కళా ప్రాంగణాన్ని స్థానిక ఎమ్మెల్యే సతీశ్ రెడ్డి ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలను మెచ్చి వాటి కోసం ఉద్దేశించిన వేదిక అభివృద్ధి కోసం రూ.10లక్షలు విరాళాన్ని ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్‌లు భాగ్యలక్ష్మి, మురళిలను సత్కరించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కే కృష్ణయ్య, వివిఎస్ రావ్, కోశాధికారి వాసుదేవ గుప్త, కార్యదర్శి నాగేశ్వరరావు, గోవిందరాజశెట్టి, అంబప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు మెయిన్‌రోడ్డు రూపేన అగ్రహారలోని వెంకటేశ్వర వీరాంజనేయస్వామి ఆలయం లోనూ వైకుంఠ ఏకాదశి వేడుకలు జరిగాయి. బంగారు, వెండి నగలతో స్వామివారిని అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 40వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణభట్ తెలిపారు. తీర్థప్రసాదాలు, లడ్డూ, క్యాలెండర్ పంపిణీ చేశారు. నరేంద్రబాబు నేతృత్వంలో ఆలయ పర్యవేక్షణ సాగుతోందన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఐదు బృందాలచే చిన్నారుల నృత్యాలు, భజనలు కొనసాగాయి.

యలబుర్గిలో వేడుకలు

బంగారపేట, : తాలూకాలోని యలబుర్గి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయలో 12వ వార్షిక వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు మేస్త్రి శ్రీనివాస్ మాట్లాడుతూ గురువారం సాయంత్రం నుంచే విశేషపూజలు కొనసాగుతున్నాయన్నారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, వైకుంఠ ద్వార పూజ, విశేషపూజా హోమాలు, పుష్పాలం కరణ అనంతరం మహామంగళారతి నిర్వహించినట్టు తెలిపారు. వైకుంఠద్వారం వరదరాజస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి పూజల అనంతరం భక్తులకు వైకుంఠద్వారం ద్వారా దర్శనానికి అనుమతించినట్టు తెలిపారు. స్థానిక ప్రముఖుడు జయరాం మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా విశేషపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నార న్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఇదే సందర్భంగా వంశోదయ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం నిర్వహించారు.


యలబుర్గిలో విశేష అలంకరణలో స్వామివారు


కురుటహళ్ళి వీరాంజనేయస్వామికి వెంకటేశ్వరస్వామి అలంకరణ


సంతోషిమాత అమ్మవారికి శ్రీవారి అలంకరణ


చేళూరులో స్వామివారికి అలంకరణ


శాంతినికేతన్ లే అవుట్‌లో స్వామివారికి పూజలు


రూపేన అగ్రహారలో వెంకటేశ్వరస్వామికి పూజలు

విద్యార్థులు.. నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): యువ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఫ్యాషన్ టెక్నాలజీ డైరెక్టర్ సిద్ధలింగప్ప అభిప్రాయపడ్డారు. కర్ణాటక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (కిల్ట్)లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణలు ఇచ్చారు. వారం రోజులపాటు భిన్నమైన అంశాలలో నైపుణ్యత కల్పించారు. ముగింపు సమావేశంలో డైరెక్టర్ సిద్ధలింగప్ప పూజారి మాట్లాడుతూ విద్యార్థులు శారీరక, మానసికంగాను శక్తివంతులు కావాలన్నారు. ఎటువంటి విద్య అయినా నైపుణ్యత సాధించే దిశగా సాగాలన్నారు. ముఖ్య లుగా పాల్గొన్న రమానంద్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, ధైర్యం, ధ్యానం నేర్చుకోవాలన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ మాస్టర్స్ శ్వేత, చన్నవీర్‌లు వారం రోజుల్లో వారికి అందించిన శిక్షణల గురించి వివరించారు. 50మంది విద్యార్థులు సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటారు.


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ సిద్ధలింగప్ప పూజారి తదితరులు

పవిత్రను వెన్నుతట్టి పరామర్శించిన దర్శన్

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో ఆరునెలలుగా జైలులో గడిపి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చిన సినీనటుడు దర్శన్, పవిత్రగౌడలు శుక్రవారం కోర్టు ముందు హాజరయ్యారు. పవిత్రాగౌడ ముందుగానే న్యాయవాదులతో కలిసి కోర్టు ప్రాంగణానికి చేరుకోగా దర్శన్ కాస్త ఆలస్యంగా వచ్చారు. దర్శన్‌ను చూడగానే పవిత్ర వచ్చి పలకరించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇదే సందర్భంలోనే దర్శన్ కూడా పవిత్రాకు వెన్నుతట్టి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. రేణుకాస్వామి హత్యకేసు తర్వాత పవిత్రా, దర్శన్‌లు దూరం అవుతారనే ప్రచారం సాగింది. కానీ కోర్టు ప్రాంగణంలో జరిగిన పరిణామం ప్రకారం ఇద్దరు స్నేహితులుగా కొన సాగుతారనే సంకేతాలు ఇచ్చారు. ఇద్దరితో పాటు కేసులో 17మంది నిందితులు సీసీహెచ్ 57వ కోర్టుకు హాజరయ్యారు.

రేపు సంక్రాంతి సంబరాలు

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు అధ్యక్షులు రాధాకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు గోపూజ, తర్వాత ముగ్గుల పోటీలు, విచిత్ర వేషధారణ పోటీలు జరుగుతాయన్నారు. ఇదే సందర్భంగా గీత గోవిందం, జాంబవతి పరిణయం, కవితల కలువలు, శుభోదయ గీతి పుస్తకాలను ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. సంక్రాంతి పండుగ గ్రామీణ సంప్రదాయాలను స్మరించుకునేదని నగరంలో నివసిస్తున్న వారికి పండుగ ప్రాధాన్యతను తెలియపరచాలనే ఏటా సంబరాలు జరుపుతున్నామన్నారు. ప్రజలందరూ పాల్గొనాలన్నారు. ముఖ్యులుగా డాక్టర్ సాహితీవేత్త హంపానాగరాజయ్య, శతావధాని ఆముదల మురళితోపాటు పుస్తక రచయితలు పాల్గొంటారన్నారు.

ఎమ్మెల్యే డ్రైవర్ ఆత్మహత్య

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గదగ్ జిల్లా శిరహట్టి బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రు లమాణి కారు డ్రైవర్ సునిల్ లమాణి (25) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎమ్మెల్యేకు చెందిన ఇంట్లోనే సునిల్ లమాణి నివసిస్తున్నారు. లక్ష్మీశ్వర పట్టణంలోని ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మర ణానికి పాల్పడ్డాడు. ఈమేరకు లక్ష్మీశ్వర పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సునిల్ లమాణి కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారు.

తుమకూరులో ఏడో తరగతి విద్యార్థి..

పావురాల బెట్టింగ్ విషయంలో మిత్రులతో గొడవ జరిగిన మేరకు తుమకూరు నగరానికి చెందిన ఏడో తరగతి విద్యార్థి త్రిశాల్ (13) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీజేపీ కార్యకర్త శకుంతల కుమారుడు త్రిశాల్. స్కూల్ యూనిఫాంలోనే ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. డెత్‌నోట్‌లో పావురాల పందెంలో స్నేహితులతో గొడవ జరిగిందని రాసుకున్నట్టు సమాచారం. జయనగర్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.



సునిల్ లమాణి(ఫైల్), త్రిశాల్ (ఫైల్)

వైదేహిలో ఎండీ కోర్సులకు ట్యూషన్ ఫీజు మినహాయింపు

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైదేహి మెడికల్ కళాశాలలో ప్రి క్లినికల్, పారా క్లినికల్ సబ్జెక్టులలో ఎండీ, ఎంఎస్ కోర్సులలో చదివే వారికి ట్యూషన్‌ఫీజు మినహాయింపు ఇచ్చినట్టు ప్రకటించారు. వైదేహి చైర్‌పర్సన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పరిధిలోని ఎండీ పాథాలజీ, ఎండీ కమ్యూనిటీ మెడిసిన్ మినహా ఎంఎస్ అనాటమీ, ఎండీ బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, మైక్రో బయాలజీ, ఫార్మకాలజీ, విభాగాలలోని ప్రభుత్వ కోటాకు సంబంధించి వందశాతం ట్యూషన్‌ఫీజు మినహాయింపు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఉచిత వసతి, బోర్డింగ్ సౌలభ్యం ఉంటుందని, ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా స్టైఫండ్ వర్తిస్తుందన్నారు.

సేల్స్‌ఫోర్స్ స్టార్టప్ పోటీలో ఏఐపిచ్‌ఫీల్డ్ విజేత

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగంలో అంతర్జాతీయస్థాయిలో పేరొందిన సేల్స్‌ఫోర్స్ సంస్థ నిర్వహించిన స్టార్టప్ కమ్యూనిటీ విభాగ పోటీలలో ఏఐ పిచ్‌ఫీల్డ్ విజేతగా నిలిచింది. పిచ్‌ఫీల్డ్ ఇండియన్ టెక్నాలజీ ఎన్విరాన్‌మెంట్ విభాగానికి చెందిన స్టార్టప్‌గా ఉంది. మల్టిమోడల్ జనరేటివ్ ఏఐ ప్లాట్‌ఫాంగా ఉండే పిచ్‌ఫీల్డ్ స్టూడియోలో నాణ్యతా ఉత్పత్తులు, వీడియోలను రూపొందించడం, రికార్డింగ్ తోపాటు ఇతరత్రా విభాగాలలో ఎక్కువమందికి షేర్ చేసేందుకు అనుకూలంగా పనిచేయనుందని సేల్స్‌ఫోర్స్ సంస్థ ఇండియా చైర్మన్ అరుంధతి భట్టాచార్య ప్రకటించినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. ఎండీ సంకేత్ అటల్ డైరెక్టర్ కార్తిగుప్త తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఖర్గే అనుచరుడి అరెస్టు

బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ సచిన్‌పాంచాళ్ ఆత్మహత్య కేసులో మంత్రి ప్రియాంకఖర్గే అనుచరుడు రాజు కపనూరు తోపాటు ఐదుగురిని సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వారందరినీ అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. రిమాండ్‌కు ఆదేశించారు. సచిన్ ఆత్మహత్య చేసుకున్న 17 రోజుల తర్వాత మాజీ కార్పొరేటర్ రాజు కపనూరు, జిల్లా పంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు గోరకనాథ్ సజ్జన్, బ్లాక్ కాంగ్రెస్ ప్రచార సమితి అధ్యక్షుడు నందకుమార్ నాగభుజంగ, కలబురగికి చెందిన ఫస్ట్‌క్లాస్ కాంట్రాక్టర్ రామనగౌడ పాటిల్, సతీశ్ రత్నాకర్ దుబలగుండిలను అరెస్టు చేశారు.

శబరిమలై యాత్రలో విషాదం

- గురుస్వామి రామకృష్ణ గుండెపోటుతో మృతి



రామకృష్ణ (ఫైల్)

విజయనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శబరిమలై యాత్రలో విషాదం చోటు చేసుకుంది. తిరుగుప్రయాణంలో బెంగళూరు భక్తులబృందంలో గురుస్వామి సిఆర్ రామకృష్ణ (68) గుండె పోటుతో కన్నుమూశారు. 50వ సారి దిగ్విజయంగా అయ్యప్ప దీక్ష ముగించి వాపసు వస్తున్న వేళ తమిళనాడులో అస్వస్థతకు లోనయ్యారు. వెంట ఉన్న కుమారుడు సమీపంలోని తూత్తుకుడి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధా రించారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్‌నగర్‌కు పార్థివ దేహాన్ని తీసుకు రాగా బంధుమిత్రులు తీవ్రంగా రో దించారు. అనంతపురం జిల్లా శింగనమలకు చెందిన రామకృష్ణ బీబీఎంపీలో శానిటేషన్ మేస్త్రిగా రిటైర య్యారు. ఆయ నకు భార్య రామాంజినమ్మ, కుమా రులు పరమేశ, అనిల్‌కుమార్, కుమార్తెలు హేమలత, నేత్రావతిలు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు

● మరో ఇద్దరు కీలక నిందితుల పరార్

హిందూపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టుచీరల పాలిష్ వ్యాపారి నారాయణరెడ్డిపై హత్యాయత్నం కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిందితుల అరెస్టు వివరాలను ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. హిందూపురం పట్టణం దండు రోడ్డు ప్రాంతంలో నివాసముంటున్న నారాయణరెడ్డి నాలుగేళ్లపాటు ముద్దిరెడ్డిపల్లిలోని అరవిందనగర్‌కు చెందిన బాలకృష్ణ అలియాస్ బాలు వద్ద డ్రైవర్‌గా పనిచేశాడు. ఇతడు చీరలను పాలిష్‌చేసి ధర్మవరం, హిందూపురానికి సరఫరా చేసేవాడు. నాలుగు నెలల క్రితం ఆర్థికపరమైన అంశాలతో నారాయణరెడ్డి, బాలకృష్ణ విడిపోయారు. నారాయణరెడ్డి సొంతంగా మినీ వ్యాన్ తెచ్చుకుని ధర్మవరం, ముద్దిరెడ్డిపల్లి నుంచి పట్టుచీరలు తీసుకొచ్చి కర్ణాటకలోని యలహంకలో పాలిష్ చేయించి అప్పగించేవాడు. నారాయణరెడ్డి.. బాలకృష్ణకు చెందిన చీరలు బయటకు తరలించే సమయంలో అధికారులకు చెప్పి ఇబ్బందులు పెట్టేవాడు. వాణిజ్య పన్నులశాఖ, జీఎస్‌టీ అధికారులకు సమాచారం ఇచ్చి జరిమానా కూడా వేయించారు. దీంతో నారాయణరెడ్డిని ఎలాగైనా అంతమొందించాలని బాలకృష్ణ నిశ్చయించుకున్నాడు. వీరిద్దరి వద్ద సన్నిహితంగా ఉండే శాంతినగర్‌కు చెందిన ఫక్రుద్దీన్ అలియాస్ చోటు అనే వ్యక్తి ద్వారా కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరుకు చెందిన ముబారక్, ఫారూక్ అలియాస్ చిరి కలిసి నారాయణరెడ్డిని హత్య చేయడానికి రూ.5లక్షలు సుపారీ మాట్లాడుకున్నారు. అందులో రూ.4 లక్షలు అడ్వాన్సుగా చెల్లించాడు. గతంలో రెండుమార్లు గౌరీబిదనూరు నారాయణరెడ్డి ఇంటివద్ద ప్రయత్నాలు చేసినా.. అవి విఫలమయ్యాయి. ఈ తరుణంలో ఈనెల 7న నారాయణరెడ్డి డ్రైవర్ తౌసిఫ్ ఇజ్‌తెమా కారణంగా విధులకు రాలేదు. దీంతో నారాయణరెడ్డే సొంతంగా వాహనం నడుపుకుని బెంగళూరుకు చీరలు తీసుకెళ్లి పాలిష్ చేయించాడు. అదేరోజు మద్యం సేవిద్దామని ఫక్రుద్దీన్ అలియాస్ చోటుకు చెప్పాడు. ఇదే అదునుగా భావించి కర్ణాటకలోని గౌరీబిదనూరుకు చెందిన ముబారక్, మహ్మద్ ఫారూక్, టిప్పూర్‌కు చెందిన సైఫుల్లా, ఉమర్ కలిసి హిందూపురం మండలంలోని పూలకుంట చెరువుకట్ట వద్దగల లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపానికి చేరేసరికి అర్ధరాత్రి దాటింది. చోటు, మరో ఐదుగురు నారాయణరెడ్డిని తీసుకెళ్లి మద్యం తాగారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి గొంతును కత్తితో కోశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చనిపోయాడని నిందితులు పరారయ్యారు. బాలకృష్ణ అలియాస్ బాలు ఘటన జరిగిన మరుసటి రోజు ఫోన్‌పే ద్వారా గౌరీబిదనూరుకు చెందినవారికి డబ్బు పంపించాడు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఐలు రాజగోపాల్ నాయుడు, జనార్దన్, అంజనేయులు నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. బాలకృష్ణ అలియాస్ బాలు, చోటు, ముబారక్, మహమ్మద్ ఫారూక్ శుక్రవారం తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఉండగా నలుగురిని అదుపులోకి తీసుకుని, విచారణ చేశారు. నేరం ఒప్పుకోవడంతో నలుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. వారి నుంచి రూ.63వేలు నగదు, బైక్, కత్తి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు సైఫుల్లా, ఉమర్ పరారీలో ఉన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.20	1,588.99
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,392	0
నీటి నిల్వ (టీఎంసీలు)	73.91	10.21

ఏనుగు దాడిలో మహిళ మృతి

వాషర్‌మెన్‌పేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో మహిళ మృతిచెందిన ఘటన కృష్ణగిరి జిల్లాలో శుక్రవారం జరిగింది. ఒన్నుకుర్చి గ్రామానికి చెందిన నాగమ్మ (59) కేలమంగళం సమీపం జక్కేరి ప్రాంతంలోని తోటలో పనిచేస్తున్న సమయంలో, పక్కనే ఉన్న పొదల నుంచి వచ్చిన ఏనుగు నాగమ్మను తొండంతో చుట్టూ విసిరేసింది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో నాగమ్మ మృతిచెందింది. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో భక్తుల మృతి

ఐసిఎఫ్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సిరుముగై పాల్‌కారన్ రోడ్డు ప్రాంతంలో అయ్యప్ప భక్తులు వస్తున్న కారు, అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. కర్ణాటక రాష్ట్రం కామరాజ్ నగర్‌కు నుంచి శబరిమలకు ఐదుగురు అయ్యప్ప భక్తులు కారులో బయల్దేరారు. అయ్యప్ప స్వామి దర్శనానంతరం శుక్రవారం ఉదయం వారు కోయంబత్తూర్ జిల్లా సిరుముగై సత్యమంగళం రోడ్డులో వస్తున్నారు. కారు డ్రైవర్ స్వామి కునుకు తీయడంతో అదుపుతప్పిన కారు రోడ్డు పక్కనే ఉన్న వేప చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో నాగరాజ్, వెంకటాద్రి ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను మేట్టుపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

● మద్యం దుకాణ యజమానిపై కేసు

రాయచూరు జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బసవేశ్వర సర్కిల్ సమీపంలో ఉన్న మంజునాథ వైన్స్ దుకాణం పై ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడి జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణం నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ సేన ఇచ్చిన పిలుపు మేరకు ఎక్సైజ్ శాఖ డీఎస్పీ మోనప్ప ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. కేవలం వైన్ శాప్‌కు మాత్రమే అనుమతి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా సమీపంలోని దుకాణం పై అంతస్తులో సిట్టింగ్ ఏర్పాటు చేసి బార్‌ను తలపించేలా తాగుడుకు అనుమతించారన్న ఫిర్యాదు మేరకు అధికారుల దాడి జరిగింది. ఈ దాడిలో ఫిర్యాదు దారులు చేసిన ఆరోపణలు వాస్తవంగా కనిపించడంతో అధికారులు దుకాణ యజమాని పై కేసు నమోదు చేశారు. కాగా అధికారుల తనిఖీలో మద్యం దుకాణంలో సరుకుల రేట్ల వివరాలు డిస్ప్లే చేయలేదని, స్టాక్ రిజిస్టర్‌లు కూడా సరిగ్గా నిర్వహించడం లేదని గుర్తించినట్లు ఎక్సైజ్ శాఖ డీఎస్పీ తెలిపారు.

మార్మోగిన గోవింద నామం



సిరుగుప్పలో..



కంప్లిలో శ్రీవారు, అమ్మవారు

బళ్లారి సిటీ/రూరల్/సిరుగుప్ప/కంప్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే వెంకటేశ్వర స్వామిని వైకుంఠ ఏకాదశి రోజున దర్శించుకుంటే మంచిజరుగుతుందని భక్తుల అపార నమ్మకం.. ఉత్తర ద్వార దర్శనంతో జీనన్ముక్తి లభిస్తుందని...ప్రగాఢ విశ్వాసం. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉభయ జిల్లాల్లో గోవింద నామస్మరణ మార్మోగింది. శ్రీవారి ఆలయాలతో పాటు, వైష్ణవాలయాల్లో భక్తులు పోటెత్తారు. నగర పరిధిలోని రామేశ్వరీనగరంలో వెలసిన వెంకటేశ్వరుడికి విశేషపూజలు నిర్వహించారు. సుమారు 70వేల మందిదాకా దేవుడిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యదర్శి సురేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని వడకరాయ దేవస్థానంలో వెంకటరమణ దేవుడిని భక్తులు ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. హంపి రోడ్డులోని వాసవి దేవస్థానంలో వెంకటేశ్వరుడికి విశేషపూజలు నిర్వహించారు. సత్యనారాయణపేటలో వెలసిన లక్ష్మివెంకటేశ్వర స్వామిని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. పాండురంగ దేవస్థానంలో పాండురంగుడికి భక్తులు దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. 20వార్డు పటేల్ నగర్‌లో లక్ష్మివెంకటేశ్వర దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పూజలు దేవస్థాన అర్చకులు శ్రీనివాసచారి నిర్వహించారు.

బళ్లారిరూరల్ : మండల పరిధిలోని రూపనగుడి గ్రామంలో రూపనగుడి వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు పోటెత్తారు. రూపనగుడి వెంకటేశ్వరాలయంలో బుడా మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి సతీమణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగనకల్ లో వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఉదయం నుంచే భక్తాదులు చేరుకుని ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఈ ఆలయం 12వ శతాబ్దం నాటి కాలంలో కట్టించిన పురాతనమైనదని గ్రామస్తులు తెలిపారు.

సిరుగుప్ప : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వెంకటేశ్వర స్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణంలోని 14వ వార్డులో వెలసిన వెంకటేశ్వరస్వామికి భక్తులు పుష్పాలంకార సేవలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తాదుల సౌకర్యార్థం ఉత్తర ద్వార దర్శనంకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కంప్లి : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తాదులు ఉపవాసం వుండి స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు. లక్ష్మీదేవికు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్తరద్వార దర్శనంతో భక్తులు పులకించిపోయారు.



విజయనగరం వడకరాయ దేవస్థానంలో భక్తుల సందడి..



సత్యనారాయణపేటలో..



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గోపాలకృష్ణ



ప్రతాప్‌రెడ్డి దంపతులు



క్యూలో వేచి ఉన్న భక్తులు

రక్తదానంతో సంపూర్ణ ఆరోగ్యం

కంప్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం పెంపొందించుకోవచ్చునని తాలుకా ఆరోగ్య అధికారి అరుణ్ కుమార్ తెలిపారు. తాలుకా పరిధిలోని నెంబర్ 10 ముద్దాపురంలో రామసాగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 83 మందికి పైగా రక్తదానం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో వున్న వారిని ఆదుకునన్న వారవుతారన్నారు. యువతీ యువకులు చెడు అలవాట్లకు దూరంగా వుండాలి. ప్రతినిత్యం యోగా, ధ్యానం, మంచి ఆహారంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం రక్తదానం చేపట్టిన యువకులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బసవరాజు, రేఖ, మాబున్నీ, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆరోగ్య అధికారి అరుణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుదేవ్ కప్పగల్లు

రేపు 'వివేక తోరణ' కార్యక్రమం

బళ్లారి సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలో వివేకానంద 162వ జయంతి సందర్భంగా జనవరి 12న సాయంత్రం రాజకుమార్ రోడ్డులోని రాఘవ కళామందిరంలో వివేక తోరణ ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తునట్లు రంగతోరణ కార్యదర్శి ప్రభుదేవ్ కప్పగల్లు తెలిపారు. శుక్రవారం కల్యాణకర్ణాటక వివాస్ అకాడమీ జిల్లా కోఆర్డినేటర్ జి.ఆర్. వస్తద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యాపారవేత్త తిమ్మారెడ్డి, ప్రముఖ స్పెషలిస్ట్ డా.ధర్మారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. గదగ్, విజయపూర రామకృష్ణ-వివేకానంద ఆశ్రమ అధ్యక్షుడు స్వామి నిర్భయానంద సరస్వతి ఉపన్యాసం ఇస్తారన్నారు. ఉపన్యాస ప్రారంభంలో ప్రముఖ హిందూస్థానీ గాయకుడు రాఘవేంద్ర గుడ్డూరు భక్తి సంగీత కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

వేడుకలను ఘనంగా చేసుకుందాం

కంప్లి, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): గణరాజ్యోత్సవాలను ఈనెల 26వ తేదీన ఘనంగా నిర్వహించుకుందామని తహసీల్దార్ శివరాజ్‌కుమార్ తెలిపారు. ఈ వేడుకలను కంప్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సంఘ సంస్థ నేతలు, అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పలు అధికారులకు సూచనలు ఇచ్చారు. అంబేద్కర్ సర్కిల్, పురసభ, తహసీల్దార్ కార్యాలయం, ప్రధాన కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలన్నారు. ఆయా పాఠశాలల్లో పాఠశాల యాజమాన్యం శ్యామియాచంద్ పాఠశాలలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. ముఖ్య అధికారి దుర్గన్న దానప్ప, చెన్నప్ప, సిద్దప్ప, బ్రహ్మయ్య, అంబన్న, విరుపాక్షి, బసవరాజు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరతోనే రైతు మనుగడ

●పంట ఉత్పత్తుల ధరల సంఘం చైర్మన్ అశోక్ దళవాయి



రాయచూరు జనవరి 10(ఆంధ్రజ్యోతి): రైతు ప్రధాన దేశంగా చెప్పుకునే భారత్‌లో రైతుకు గిట్టుబాటు ధర లభిస్తేనే మనుగడ సాధ్యమని కర్ణాటక పంట ఉత్పత్తుల ధరల కమిషన్ చైర్మన్ అశోక్ దళవాయి అన్నారు. శుక్రవారం రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న సాగు విస్తీర్ణంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అనే అంశానికా సంబంధించి నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో అశోక్ పాల్గొని మాట్లాడారు. దేశంలోని అన్ని రంగాల్లో సంక్షేమ విభాగాలు ఉన్నా రైతుల కోసం ప్రత్యేక సంక్షేమ విభాగం లేకపోవడం విచారకరమన్నారు. గతంతో పోలిస్తే 2015 అనంతరం సాగు రంగం పలు సవాళ్లను ఎదురిస్తున్నట్లు అశోక్ దళవాయి తెలిపారు. సాగు విస్తీర్ణం పెరుగకపోవడం సాగు వ్యయం పెరగడం, దిగుబడులు తగ్గడం తదితర అంశాలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేశాయన్నారు. దేశంలో 45 శాతం మంది కార్మికులు వ్యవసాయ రంగం పైనే ఆధార పడి ఉండడం వారికి ఉపాధి కల్పించడం సవాలుగా మారిందన్నారు. దీనికి తోడు వ్యవసాయ రంగం సాంకేతిక పరిజ్ఞానం, లాభాల ఒత్తిడి, వాతావరణ మార్పును వడ్డే సమస్యలను ఎదుర్కొంటు రైతులకు సవాలుగా మారిందన్నారు. దేశంలో ముఖ్యంగా సాగు రంగంలో క్షీణిస్తున్న జీడీపీ వల్ల రైతులు, కార్మికులు పేదులుగా మారుతుండడం సమస్యగా మారిందన్నారు. వీటిని అదిగమించేందుకు సాగురంగంలో మరిన్ని పరిశోధనలు, సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి: కలెక్టర్

బళ్లారి సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని బాలకార్మికుల రక్షణ పనులు వేగవంతం చేయాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సూచించారు. నగరంలోని జిల్లానూతన పాలనా భవనంలోని హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన బాలకార్మిక పథకం జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బాల కార్మికులు విద్యను దూరం చేయడం నేరమన్నారు. అకస్మిక దాడులు నిర్వహించి చిన్నారులకు రక్షణ కల్పించాలన్నారు. పిల్లలను పనిలోపెట్టుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల ఆరోగ్యం , విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏడు రోజులకు మించి పిల్లలు పాఠశాలలకు గైర్హాజరైతే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్ళి పిల్లలను పాఠశాలకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. ఇప్పటికే అమలులో ఉన్న జిల్లా తాలూకా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు మరింత బ్యాధ్యతగా పని చేయాలన్నారు. యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో జిల్లాబాలకార్మికుల ప్రాజెక్టు అధికారి మౌనేశ్ మాట్లాడుతూ వివిధ శాఖల సహకారంతో ఇప్పటి వరకు 20 ప్రమాదవశాత్తు దాడులు నిర్వహించి 24మంది బాలకార్మికులు, బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 19కేసులు నమోదు చేశామన్నారు. బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా స్వస్తి పలికి తల్లిదండ్రులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. సమావేశంలో జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్‌శరణప్ప, అదనపు పోలీస్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్, జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బస్సు చార్జీల పెంపుతో పేదలపై భారం: జేడీఎస్

బళ్లారి సిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): బస్సు చార్జీలు పెంచడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపై భారం మోపిందని జేడీయస్ పార్టీ జిల్లాధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జేడీఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వెంటనే పెంచిన బస్సు చార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. సురక్షితంగా ఉన్న కర్ణాటక ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం దిగజార్చిందన్నారు. రవాణా ఛార్జీలను 15శాతం పెంచి సామాన్యులపై ధరల ఉచ్చును మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యారెంటీ పథకాల వల్ల రవాణా సంస్థ దివాళా తీసిందని, రాష్ట్రరవాణా సంస్థకు రూ.2వేల కోట్ల రుణానికి మంత్రివర్గం ఇప్పటికే ఆమోదం తెలిపింది. మహిళలకు ఉచిత ప్రయాణం ఇవ్వండి. దాని నష్టాన్ని భర్తీ చేయడానికి ఛార్జీలను పెంచండి ఇది ఎక్కడి న్యాయమన్నారు. జేడీఎస్ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఐదు హామీ పథకాలతో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి పాడు చేస్తున్నారన్నారు. ఆయనది తుగ్లక్ అహంకారమన్నారు. ఇది రైతు దళిత వ్యతిరేక ప్రభుత్వమని అన్నారు. ఈసందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి, కురేకుప్ప సోమప్ప, రాజునాయక్, హొన్నూరుస్వామి, మదిరి విజయ్ కుమారు, అశోక్, శివనారాయణ, మేఘరాజ్, గామాంజనేయులు, కిరణ్,శివనారాయణ,కుమార బసప్ప, జమీల, రేణుక, నీల, నాగవేణి,ముత్తు, బసవ హావంబావి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసనలో జేడీఎస్ నాయకులు

హోసూరు జోన్

ఘనంగా పొంగల్ పండుగ



పొంగల్ వేడుకల్లో పాల్గొన్న స్థానికులు

హోసూరు జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డు కామరాజునగర్‌లోని మహాలక్ష్మి టైలరింగ్ శిక్షణ కేంద్రంలో పొంగల్ పండుగను నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి పండుగను నిర్వహించుకున్నారు. రంగోలి వేసి మట్టి కుండలలో పొంగల్ సిద్ధం చేశారు. యజమాని జీవా నేతృత్వంలో ఇక్కడ యువతులకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇందుల్లో పీఎంసీ పశ్చిమ జిల్లా ఉప కార్యదర్శి వెంకటేశం, హరిత జన్మభూమి రాష్ట్ర ఉపకార్యదర్శి మునిశేఖర్‌తో పాటు శిక్షణ పొందిన వారు వారి వారి కుటుంబాలతో పాల్గొన్నారు.

ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందడి



దర్శించుకుంటున్న భక్తులు



ఉత్సవ మూర్తికి విశేష పూజలు

హోసూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వివిధ ఆలయాల్లో విశేషపూజలు సాగాయి. హోసూరు గోపసంద్రం గ్రామంలోని దక్షిణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠద్వారం నిర్వహించారు. వెంకటాచలపతి నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి వివిధ పుష్పాలంకారాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. డెంకణీకోట బ్యాటరాయస్వామి, హోసూరు వెంకటేశ్వర నగర్‌లో వెలసిన వెంకటేశ్వర స్వామి, నేతాజీ రోడ్డులోని కోదండరాముడు తదితర ఆలయాల్లో భక్తుల గోవిందనామ స్మరణ జరిగింది. నాదస్వరం



కచ్చేరీ, భక్తి గీతాలు, భరతనాట్యం, కోలాటం కార్యక్రమాలతోపా హరికథ కూడా జరిగింది. తొరపల్లి గ్రామంలోని ఆలయాల్లోనూ పూజలు సాగాయి. ఇలా చుట్టు ప్రాంతాల నుంచి సరిహద్దులోని అలాగే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

బస్సు సర్వీసుల కోసం విద్యార్థుల రాస్తారోకో

హోసూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హోసూరు బేరికై రోడ్డు, పునుగన్‌దొడ్డి ,చిత్తనపల్లి, ముత్తాళి సహా 15కు పైగా గ్రామాల వారికి వీలుగా ప్రభుత్వ ఆర్టీసీ సర్వీసులు పాఠశాల, కళాశాల వేళల్లో తగినన్ని నడపాలని కోరుతూ విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం ప్రైవేట్ బస్సులను ఆపి రోడ్డుపై నిరసన తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రైవేట్ బస్సులు తప్ప, ఆర్టీసీ బస్సులు సక్రమంగా రావడం లేదని ఆరోపించారు. ప్రత్యేకించి 21వ నెంబరు బస్సు నెల రోజుల పాటు సరైన సమయానికి రాకపోవడంతో సకాలంలో పాఠశాల, కళాశాలకు చేరుకోలేకపోయామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల జోక్యంతో విద్యార్థులు నిరసన వీడారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న విద్యార్థులు



ఉపాధ్యక్షురాలు లక్ష్మీ మల్లయ్యను సత్కరిస్తున్న పదాధికారులు

ఉపాధ్యక్షురాలి ఎన్నిక ఏకగ్రీవం

బళ్లారిరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని రూపనగుడి గ్రామంలో గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలు ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. శుక్రవారం ఈఓ మడిగిన బసప్ప ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సర్వసభ్యుల ఆధ్వర్యంలో సర్వసభ్యులు ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీ మల్లయ్యలను సర్వసభ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని సర్వసభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా అబినందించారు. పీడీఓ ప్రకాష్ మాజీ గ్రామ పంచాయతీ అధ్యక్షులు నాగరాజు, మాజీ తాలుకా పంచాయతీ అధ్యక్షులు గోవిందు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

కంప్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో ముందడుగు వేసినప్పుడే మరింత గుర్తింపు లభిస్తుందని స్వామి వివేకానంద పాఠశాల వ్యవస్థాపకులు బడిగేర్ జిలాన్ సాబ్ తెలిపారు. శుక్రవారం విద్యార్థులకు విజ్ఞాన వస్తు ప్రదర్శన జరిపారు. అందులో విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శించారు. ఉపాధ్యాయులు శ్వేత, ఉమ, మన్నూరు లక్ష్మీ, హర్ష, మస్తాన్, గౌసియా, అక్కమాదేవి, మజుందర్ పాల్గొన్నారు.



ఊపిరితిత్తుల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు